క్లుప్తంగా

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గంట్యాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాన్ని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పి.శివన్నారాయణమూర్తి, ఎస్ఐ సాయికృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శివన్నారాయణమూర్తి మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనున్నట్టు తెలిపారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మార్చి 18 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



పెంటయ్య (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో పురుగు మందుతాగి మామిడి పెంటయ్య (47) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. ఈ మేరకు ఆమె తెలిపిన వివరాల ప్రకారం పెంటయ్యకు ఎక్కువగా మద్యం తాగే అలవాటు ఉండడంతో రోజూ మద్యం తాగితే ఆరోగ్యం చెడిపోతుందని కుటుంబం రోడ్డున పడుతుందని భార్య సత్యవతి మందలించడంతో గ్రామ సమీపంలో ఉన్న ఆసరబంద చెరువు వద్ద పురుగు మందు తాగేశాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య సత్యవతి కుమారుడు, వివాహమైన కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పశువుల నిర్బంధం

- వ్యక్తిపై కేసు నమోదు



అక్రమంగా నిర్బంధించిన పశువుల వద్ద సీఐ షణ్ముఖరావు తదితరులు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామ శివారు మామిడి తోటలో అక్రమంగా నిర్బంధించిన 202 పశువులను సీఐ సిహెచ్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కాపాడారు. వీటిని వధించి వేరొక చోటకు మాంసాన్ని తరలించేందుకు సిద్ధంగా వున్నాయని ఒక అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. పశువులను అక్రమంగా తరలించి నిర్బంధించిన గొట్టివాడ ఎర్రిబాబును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పశువులను ప్రస్తుతం సంతపాలెం గ్రామ శివారు మామిడి తోటలోనే ఉంచామని కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

సేవలతోనే గుర్తింపు



పదవీ విరమణ చేసిన శంకరరావు మాస్టారుకు సన్మానం

వేపాడ: ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు రెడ్డి శంకరరావు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయన్నారు. శంకరరావు సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

లక్కవరపుకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కో రారు. సభ్యులంతా హాజరు కోవాలని కోరారు.

ఇంట్లో బంగారం చోరీ

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున తుపాకుల సూరమ్మ ఇంట్లో తులం పావు బంగారం దొంగలు చోరీ చేశారు. ఈ విషయం పెదమానాపురం పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీమ్ వచ్చి ఫింగర్ ప్రింట్ తీసుకున్నట్లు గ్రామ సర్పంచ్ తండ్రి నేతేటి వెంకటరమణ తెలిపారు.

ఆలోచింపజేసిన విజ్ఞాన ప్రదర్శనలు

- పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- శాస్త్రీయ పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలి



గజపతినగరం: జాతీయ సైన్స్ దినోత్సవంలో మాట్లాడుతున్న డీఈఓ మాణిక్యంనాయుడు



చీపురుపల్లి: బాలుర ఉన్నత పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శనలు తిలకిస్తున్న హెచ్ఎం చంద్రశేఖర్ తదితరులు



బొండపల్లి: గరుడుబిల్లి హైస్కూల్‌లో సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈఓ 2 వెంకటరమణ తదితరులు



చీపురుపల్లి రూరల్: గరివిడి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న జడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు తదితరులు



ఎస్.కోట: వెంకటరమణపేట హైస్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తవలస: కంటకాపల్లి హైస్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రాజెక్టులు

సైన్స్ ప్రదర్శనల ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని పలువురు విద్యాశాఖాధికారులు విద్యార్థులకు సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సైన్స్ విజ్ఞానం ద్వారా దేశ పురోగతి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మెరకముడిదాం: చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

మహాత్మా.. మన్నించు...

జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం లక్కవరపుకోటలో నిరాదరణకు గురై దర్శనమిస్తోంది. స్వాతంత్య్ర పోరాటంలో అసువులు బాసిన జాతిపితను స్మరించుకోవడం మనందరి బాధ్యత. ఇందులో భాగంగానే లక్కవరపుకోట మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో దీని ఆలనాపాలన బాగానే చూశారు. కాలక్రమంలో దీన్ని ఎవరూ పట్టించుకోవడం మానేశారు. కేవలం జాతిపిత జయంతి, వర్ధంతి రోజుల్లోనే స్థానిక నేతలు పూలమాలలు వేసి ఫొటో స్టిల్స్ ఇచ్చేసి తరువాత పట్టించుకోవడం మానేశారు. – లక్కవరపుకోట



ఆటపాటలతో చిన్నారులను ఆకట్టుకోవాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల్లోని చిన్నారులను ఆటపాటలతో ఆకట్టుకోవాలని వియ్యంపేట ప్రాజెక్టు సీడీపీఓ రొంగలి ఉమాదేవి సూచించారు. కొత్తవలస మండలంలోని మంగళపాలెం 1, 2 కేంద్రాలతో పాటు గొల్లపేట అంగన్‌వాడీ కేంద్రాలను సహాయ సీడీపీఓ లక్ష్మీభాయితో కలిసి శుక్రవారం సందర్శించారు. కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. – కొత్తవలస



విద్యార్థుల ఆందోళన



ఎస్.కోట మండలం పోతనాపల్లి వద్దనున్న సాయిరంగా పాలిటెక్నిక్ కళాశాలను అధికారులు సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం కళాశాల వద్ద ఆందోళన చేశారు. కళాశాల నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. కనీస మౌలిక సదుపాయాలు లేవని పేర్కొన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలకు అనుమతులు లేకుండా ఒకే వసతిగృహం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, రమేష్, చినబాబు, రవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

ఘనంగా దర్జీల దినోత్సవం



ఎస్.కోటలో టైలర్స్ డే నిర్వహిస్తున్న టైలర్లు

శృంగవరపుకోట: పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం వద్ద ప్రపంచ దర్జీల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్‌ను కనుగొన్న విలియం హో చిత్రపటానికి టైలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరస్పరం అభినందనలు తెలుపుకొని మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా టైలర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్రంలో దర్జీ వృత్తిని నమ్ముకుని 16 లక్షల మంది జీవిస్తున్నారన్నారు. తమను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. టైలరింగ్‌ను ఒక వృత్తిగా, ఉపాధిగా గుర్తించి వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, టైలర్లకు 50 ఏళ్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, టైలరింగ్ కోపరేటివ్ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సభ్యులు సిద్దనాతి తాతారావు, ఐ.త్రినాధ, బత్తిన అప్పారావు, టైలర్లు కె.సత్యారావు, ఎల్.శ్రీనివాసరావు, నాయుడు, కృష్ణవేణి, స్వాతి, హేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బొడ్డవర గ్రామంలో టైలర్స్ డే సందర్భంగా వాసవీ వనితా సంఘం అధ్యక్షురాలు పి.కోటిరత్నం, కోశాధికారి ధనలక్ష్మి టైలర్స్‌కు శాలువలతో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: మండలంలోని కెంగువ ఫీడర్ పరిధిలో ఉన్న లింగాలవలస రోడ్డు విస్తరణ పనుల కారణంగా విద్యుత్ లైన్లను మార్పు చేయాల్సి ఉందని బొబ్బిలి కార్యనిర్వాహక (ఆపరేషన్) ఇంజినీర్ ఎ.అనంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల వల్ల ఆ ఫీడర్ పరిధిలోని లింగాలవలస గ్రామానికి శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెత్తశుద్ధి కేంద్రాల నిర్వహణకు చర్యలు



మార్లాపల్లి చెత్తశుద్ధి కేంద్రంలో కుండీలకు సున్నం వేసి వినియోగంలోకి తీసుకొచ్చిన అధికారులు



చందులూరు చెత్తశుద్ధి కేంద్రం షెడ్‌ను పునర్నిర్మించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

లక్కవరపుకోట: గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతతో పాటూ చెత్త నుంచి ఎరువు తయారు చేసి తద్వారా సంపద సృష్టించడమే లక్ష్యంగా నెలకొల్పిన చెత్తశుద్ధి కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ అంశంపై ఫిబ్రవరి 15న చెత్తశుద్ధి ఏదీ అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అస్తవ్యస్తంగా ఉన్న కేంద్రాల్లోని గల కుండీలకు సున్నం వేసి చెత్తను అందులోకి తరలిస్తున్నారు. చిందరవందరగా ఉండే షెడ్లపైన రేకులను పునర్నిర్మిస్తున్నారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

లెప్రసీ బాధితులకు విద్యార్థుల సాయం



విరాళాన్ని లెప్రసీ ఎగ్జిక్యూటివ్ రమణకు అందజేస్తున్న హెచ్ఎం రాము తదితరులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లెప్రసీ బాధితుల అంగవైకల్య నివారణ కోసం రూ.9486 లను విరాళంగా అందజేసి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ మొత్తాన్ని లెప్రా సొసైటీ ఫండ్ రైజింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు శుక్రవారం హెచ్ఎం డి.రాము చేతుల మీదుగా అందజేశారు. లెప్రా సొసైటీ ఎగ్జిక్యూటివ్ రమణ మాట్లాడుతూ లెప్రా సొసైటీ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా కుష్టు నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్య నివారణ కోసం రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే కుష్టు వ్యాధి బాధితులకు ఉచితంగా పాదరక్షలు, సెల్ఫ్‌కేర్ కిట్లు, ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామన్నారు.

విద్యుత్ తీగలు తాకి చెలరేగిన మంటలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో గడ్డిని తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి శుక్రవారం మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. వేపాడ నుంచి సోంపురం వైపు గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు అరిగిపాలెం వద్ద విద్యుత్ తీగలు తగిలి మంటలు రేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశాయి.

సన్యాసేశ్వరుని ఆదాయం రూ.15.67 లక్షలు

శృంగవరపుకోట: మండలంలోని సన్యాసేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి రెండు రోజుల జాతర సందర్భంగా హుండీ ఆదాయం దండిగా వచ్చింది. దేవస్థానం ఈఓ ప్రసాద్ నేతృత్వంలో హుండీ ఆదాయాన్ని సిబ్బంది, ఉద్యోగులు, భక్తులు శుక్రవారం లెక్కించారు. రెండు రోజులకుగానూ రూ.15,67,732లు ఆదాయం సమకూరింది. ఇందులో టికెట్ల ద్వారా రూ.7,80,692లు సమకూరినట్టు దేవదాయశాఖ సిబ్బంది చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకు లావాదేవీలను నిర్వహించే పుస్తకాన్ని విడుదల చేస్తున్న బీఎంలు, ఎస్ఐ

లక్కవరపుకోట: ప్రతీ ఒక్కరు బ్యాంకు డిపాజిట్ ఖాతాలు నిర్వహణ, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా వుండాలని గ్రామీణ, స్టేట్ బ్యాంక్ బ్యాంకుల మేనేజర్లు రమేష్‌బాబు, భరద్వాజ్ అన్నారు. మండలంలోని ఓ స్కూల్‌లో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాపును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కలిగి వుండాలని బ్యాంకు రూపొందించిన యాప్‌లను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎస్ఐ నవీన్‌పడాల్ మాట్లాడుతూ సైబర్ నేరాల జరిగే తీరును వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జగదీష్, ట్రైనర్లు ఫణికుమార్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు

డెంకాడ: రక్తదాన శిబిరాల ద్వారా మీరందించే రక్తం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుందని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్, క్యాంపస్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ యూత్, ఎన్వీఎన్ బ్లడ్‌బ్యాంక్, న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 92 మంది రక్తదానం చేయగా.. వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, ప్లేస్‌మెంట్ డీన్ ఎం.సునీల్‌ప్రకాష్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎన్.షణ్ముఖరావు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ VZM 90 రోజులు ఉచితంగా Hotel Management ట్రైనింగ్‌తో పాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (PASS), INTER, Degree, ITI (Pass/Fail), Age: 18 to 35. Contact: 9493359471, 9493359472 [SCA25001911]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్ : 80084 01243 [V- 6672]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99983]

■ త్రినేత్ర హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ :18K. , Ph : 8520980099, 8520874499 [HA-1902]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గజపతినగరం : 9010204447 చీపురుపల్లి : 9010133309 ఎస్.కోట : 9951602965

Office mail : vzmadvt@gmail.com